ఆంధ్రజ్యోతి
రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.31 | సహర్: 5.03 (గురువారం)
ANDHRAJYOTHY
నల్లగొండ
5
బుధవారం 13 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర: 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.136	197	224
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.136	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 , కనిష్ఠం 23.4

ఏకశిఖరవాసుడు.. స్వయంభు పాంచనారసింహుడు కొలువైన దివ్యక్షేత్రం.. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు మంగళవారం ఆధ్యాత్మిక పర్వాల కోలాహలం నెలకొంది. లోకకల్యాణం, విశ్వశాంతి కోసం ముక్కోటి దేవతలు ఆహుతులుగా.. బ్రహ్మ సారథ్యంలో లక్ష్మీనరసింహుల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు యాదగిరీశుడి పుణ్యక్షేత్రం వేదికైంది. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టానికి వేదపండితులు శ్రీకారం చుట్టారు. ధ్వజారోహణం, దేవతాహ్వానం, హోమ పూజలు, రుత్వికుల వేద పారాయణ పఠనాలతో యాదగిరికొండ ఆధ్యాత్మిక సందడిని సంతరించుకుంది.

\- యాదగిరిగుట్ట



భేరి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

ఏకశిఖరవాసుడి సన్నిధిలో
ఆధ్యాత్మిక కోలాహలం

- బ్రహ్మోత్సవాల్లో విశేష ఘట్టాలకు శ్రీకారం
- నేత్రపర్వంగా ధ్వజారోహణం
- నేటి నుంచి అలంకార సేవోత్సవాలు
- శాస్త్రోక్తంగా భేరీపూజ, దేవతాహ్వానం



బ్రహ్మోత్సవాలలో నేడు

- ఉదయం 9గంటలకు దివ్యప్రబంధ వేదపారాయణాలు, మత్స్యావతారంలో నృసింహుడి దివ్య దర్శనం.
- రాత్రి 7గంటలకు శేషవాహన సేవలో స్వామివారి కి తిరువీధి సేవ.

నృసింహుడి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానించడానికి మహా విష్ణువు ఇష్టవాహనమైన గరుత్మంతుడిని ఆహ్వానించడానికి జరిపే తంతు ధ్వజారోహణం. ప్రధానాలయ ముఖమండపంలో గరుడాళ్వార్ల చిత్రపటం వద్ద పట్టువస్త్రాలు, వజ్రవైఢూర్యాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకృతుడైన లక్ష్మీనృసింహులను అధిష్ఠింపజేసి అనంతరం ఆలయ తిరుమాడ వీధుల్లో వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. స్వామివారినిప్రధానాలయ ముఖమండపంలో సువర్ణమయ ధ్వజస్తంభం ఎదుట ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, శ్వేత ధ్వజ పతాకంపై చిత్రించిన గరుత్మంతుడిని వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ధ్వజస్తంభంపైకి ఆరోహణ చేశారు. ఇంద్ర, యమ, వరుణ, కుబేరాది అష్టగణాలను ఆవాహన చేసి మూలమంత్రంతో గరుడ ప్రసాదానికి పూజలు నిర్వహించారు. అనంతరం గరుత్మంతుడిని ఆహ్వానించడానికి గరుడ ముద్దలను ఎగురవేశారు. గరుడ ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు.

యాగశాలలో హవన పూజలు

స్వామివారి తిరుకల్యాణ వేడుకలకు 33కోట్ల మంది దేవతలను ఆహ్వానించి పంచసూక్త పఠనాలతో సంతృప్తి పరిచే హవన కార్యక్రమాలను ప్రాకార మండపంలోని యాగశాలలో అర్చకస్వాములు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఉదయం యాగశాల ప్రవేశం చేసిన ఆచార్యులు చతుస్థానార్చనలు, అగ్ని ప్రతిష్ఠ చేసి పంచసూక్తాలు, మూలమంత్ర, మూర్తి మంత్ర పఠనాలతో హోమం నిర్వహించి నిత్యలము పూర్ణాహుతి నిర్వహించారు. క్షేత్ర మహత్యం ఇనుమడింపజేస్తూ మహాలక్ష్మీ, నరసింహ మూలమంత్ర జపాలు, దివ్యప్రబంధ పారాయణ పఠనం చేశారు. స్వామివారి బ్రహ్మోత్సవ కైంకర్యాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో యాజ్ఞీకస్వామి, అర్చక బృందం, వేద పండితులు నిర్వహించారు. వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో ఎం.రామకృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.



శాస్త్రోక్తంగా భేరీపూజ, దేవతాహ్వాన పర్వాలు

యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలకు అష్టదిక్పాలకులను ఆహ్వానించడానికి మంగళవారం రాత్రి భేరీపూజ, దేవతాహ్వానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో జరిగిన ఈ విశేష వేడుకలల్లో అష్టదిక్పాలకులకు ఆహ్వానం పలుకుతూ సప్త స్వరాలు, ఇష్ట వాయిద్యాలను శ్రవణానందంగా మోగించారు. శబ్ద బ్రహ్మ మూలమంత్ర జపంతో ప్రధాన వాయిద్యం 'భేరీ'ని మోగించి కంకణధారణ చేయడం ఈ మహోత్సవ ప్రత్యేకత.

నేటి నుంచి అలంకార సేవోత్సవాలు

యాదగిరీశుడి వార్షిక బ్రహ్మోత్సవాలలో మూడో రోజు నుంచి లక్ష్మీనృసింహుడిని దశావతారాలు, వివిధ వాహన సేవల్లో అలంకరించి సేవోత్సవం నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆచారం. పట్టుపీతాంబరాలు, బంగారు ముత్యాలు, వజ్రాభరణాలలో లక్ష్మీనృసింహుడిని దివ్యమనోహరంగా అలంకరించి ఉదయం, సాయంత్రం తిరువీధి సేవోత్సవం నిర్వహిస్తారు.

బీఆర్ఎస్‌లో 'గుత్తా' కలవరం

- సీఎం ముఖ్యసలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసిన అమిత్‌రెడ్డి
- కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకే చర్చించారని సమాచారం
- భువనగిరి ఎంపీ సీటుపై కొనసాగుతున్న సమాలోచన
- వ్యక్తిగత సమావేశమే తప్ప రాజకీయాలకు సంబంధం లేదన్న అమిత్

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యసలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితో సమావేశమవడంపై రాజకీయ దుమారం చెలరేగింది. కాంగ్రెస్‌లో చేరి, భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసేందుకు అవకాశం కల్పించాలని కోరేందుకే హైదరాబాద్‌లో మంగళవారం సమావేశమైనట్టు రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. అమిత్‌రెడ్డి ఇటీవల రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సైతం కలిసినట్టు వార్తలు రాగా, వేం నరేందర్‌రెడ్డితో సమావేశమవడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు కనిపిస్తోంది.

\- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్‌రెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఉమ్మడి జిల్లాలో ఆసక్తికరంగా మారాయి. మునుగోడు ఉప ఎన్నిక సమయంలోనే బీఆర్ఎస్ అభ్యర్థిగా అమిత్‌కు అవకాశం ఇవ్వాలని సుఖేందర్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కోరినా, అప్పటి పరిస్థితుల నేపథ్యంలో పోటీకి అవకాశం దక్కలేదు. గుత్తా సుఖేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరినప్పటి నుంచి మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి వర్గంతో కొంత విభేదాలు కొనసాగిన నేపథ్యం, గడిచిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో సుఖేందర్‌రెడ్డి అనుచరులుగా భావించే కీలకనేతలు కాంగ్రె‌స్‌లో చేరడంతో నాడు విమర్శలు వెల్లువెత్తాయి. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక అమిత్‌రెడ్డి ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి స్థానాల్లో ఎక్కడ అవకాశమిస్తే అక్కడ పోటీచేస్తానని ప్రకటించారు. అంతేగాక తన సేవా ట్రస్ట్ ద్వారా, పార్టీ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల మాజీ సీఎం కేసీఆర్ నల్లగొండ పర్యటన అనంతరం, తాజాగా తాను లోక్‌సభకు పోటీచేయబోవడం లేదని అమిత్‌రెడ్డి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు స్పష్టం చేశారు. అమిత్‌రెడ్డి ప్రకటనపై స్పందించిన మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి ఎంపీగా పోటీచేయాలని అధిష్ఠానం ఇంకా ఎవ్వరికీ చెప్పలేదని, అమిత్ తానే పోటీచేస్తానని ప్రకటించారని, తర్వాత ఆయనే పోటీచేయకుండా విరమించుకున్నారని, ఈ ప్రకటనలకు పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఖండించడం రాజకీయవర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ క్రమంలో సోమవారం హైదరాబాద్‌లో మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించిన సమావేశానికి కూడా అమిత్‌రెడ్డి డుమ్మా కొట్టడం, తాజాగా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితో సమావేశమవడంతో ఆయన కాంగ్రె‌స్‌లోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారనే సంకేతాలు వెలువడుతున్నాయి. కాంగ్రె‌స్‌లో నల్లగొండ ఎంపీ టికెట్‌ను ఇప్పటికే కుందూరు రఘువీర్‌రెడ్డికి ప్రకటించగా, భువనగిరి స్థానం కోసం కోమటిరెడ్డి కుటుంబీకులు, ఇతర కీలకనేతలు పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా గుత్తా అమిత్ ఈ సీటుని ఆశిస్తుండడం కాంగ్రె‌స్‌లోనూ కాకరేపుతోంది. అమిత్‌కు ఎంపీ టిక్కెట్ ఇస్తారా? లేక భవిష్యత్ హామీతో పార్టీలో చేర్చుకుంటారా? అనే విషయంతో పాటు పార్టీ మార్పు జరిగితే అది అమిత్‌రెడ్డికే పరిమితమవుతుందా? మండలి చైర్మన్‌గా రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్న సుఖేందర్‌రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే అంశం తేలాల్సి ఉంది. వేం నరేందర్‌రెడ్డితో సమావేశంపై 'ఆంధ్రజ్యోతి' అమిత్‌రెడ్డిని సంప్రదించగా, నరేందర్‌రెడ్డి తమకు బంధువని, వ్యక్తిగత సమావేశమే తప్ప అందులో రాజకీయం లేదని, పార్టీ మార్పు అంశమేదీ తమ మధ్య చర్చకు రాలేదని తెలిపారు.



- ఓవైపు కొరత మరోవైపు అధిక ధర
- 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఇదే పరిస్థితి
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న స్టాంప్ వెండర్లు
- రిజిస్ట్రేషన్‌శాఖ అధికారుల పర్యవేక్షణ కరువు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వినియోగదారులు

స్టాంపుల బ్లాక్ దందా

స్టాంపులు రిజిస్ట్రేషన్‌శాఖ పర్యవేక్షణ కొరవడంతో నాన్ జ్యుడీషియల్ స్టాంపుల విక్రయం అస్తవ్యస్తంగా మారింది. చట్టబద్ధమైన ప్రతీ పనికి స్టాంపులు అవసరం. అయితే సంబంధితశాఖ ఆ స్టాంపులను అందుబాటులో ఉంచుతోందా? లేక వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? అనేది అర్థం కావడం లేదు. స్టాంపులు రిజిస్ట్రేషన్‌శాఖ ఉద్యోగులు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి ఇండెంట్ పెడుతూ స్టాంపులను అందుబాటులో ఉంచాలి. కానీ ఉమ్మడి జిల్లాలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. దీంతో స్టాంపుల వినియోగదారులతోపాటు ఆస్తుల క్రయ, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

\- నల్లగొండ

ప్రతీ నెల ఏ మేరకు స్టాంపులు అవసరం అనేది అధికారుల వద్ద సమాచారం ఉంటుంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి స్టాంపుల అవసరాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా అందుబాటులో ఉంచాలి. కానీ ఈ పరిస్థితి ఉమ్మడి జిల్లాలో కానరావడం లేదు. ఈ నెల 31తో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుంది. వివిధ ఆర్థిక లావాదేవీలతో పాటు బ్యాంకు రుణాలు తదితర అవసరాల కనుగుణంగా స్టాంపుల కొనుగోళ్లు జరుగుతూ ఉంటాయి. అయితే ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. అధికారులు మాత్రం స్టాంపుల కొరత లేదని చెబుతుండగా, మరి స్టాంప్ వెండర్లు కృత్రిమ కొరత సృష్టించి వాటిని బ్లాక్‌లో విక్రయిస్తున్నారా? అనే అనుమానాలను వినియోగదారులు వ్యక్తం చేస్తున్నారు.

ఈ-స్టాంపులు, ఫ్రాంకింగ్ మిషన్ల పరిస్థితి ఏంటి?

నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉన్నప్పుడు ఈ-స్టాంపుల ద్వారా, లేదంటే ఫ్రాంకింగ్ మిషన్ల ద్వారా సమస్యను తీర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉన్న ఫ్రాంకింగ్ మిషన్లు మరమ్మతులకు గురవుతుండటంతో వినియోగదారులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇదే సమయంలో స్టాంప్ వెండర్లు వారి వద్ద ఉన్న స్టాంప్‌లను అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఏ క్రయ, విక్రయానికి ఎంత ధర ఉన్న స్టాంప్ వినియోగించాలో వినియోగదారులకు పెద్దగా అవగాహన లేదు. దీంతో స్టాంపుల కృత్రిమ కొరత, అధిక ధరకు విక్రయించే దందాకు వెండర్లు తెర లేపారు. ఉమ్మడి జిల్లాలోని భువనగిరి, బీబీనగర్, చండూరు, చౌటుప్పల్, దేవరకొండ, హుజూర్‌నగర్, కోదాడ, మిర్యాలగూడ, మోత్కూర్, నకిరేకల్, నల్లగొండ, నిడమనూరు, రామన్నపేట, సూర్యాపేట, యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఈ దందా కొనసాగుతోంది. అయినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్టాంప్‌లను విరివిగా తెప్పించడంతో పాటు స్టాంప్ వెండర్లు సృష్టిస్తున్న కృత్రిమ కొరతను అరికట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. వెండర్ల వద్ద స్టాక్ ఎంత ఉంది? ఎన్ని విక్రయించారనేది పరిశీలించాల్సిన అవసరం ఉంది. దీంతోపాటు లైసెన్సు పొందిన అడ్రస్‌లోనే స్టాంప్‌లను విక్రయిస్తున్నారా లేదా? అనే దానిపై నిఘా పెట్టాల్సి ఉంది.

అధిక ధరకు విక్రయం

స్టాంప్ వెండర్లు స్టాంపుల కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 400మంది స్టాంప్ వెండర్లు ఉన్నారు. చాలామంది స్టాంప్ వెండర్లు చూపిన అడ్రస్ ఒక చోట, విక్రయించేది మరో చోట. రిజిస్ట్రేషన్‌శాఖ నిబంధనల ప్రకారం స్టాంప్ వెండర్లు ఎక్కడైతే స్టాంపులు విక్రయిస్తామని చిరునామాలో పేర్కొని లైసెన్స్ పొందారో అక్కడే విక్రయించాలి. అయితే చాలా మంది స్టాంప్ వెండర్లు సమీప రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద దుకాణాలు ఏర్పాటు చేసుకొని స్టాంప్‌లను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో ఆస్తుల క్రయ, విక్రయదారులపై తీవ్ర భారం పడుతోంది. రూ.10, 20, 50, రూ.100 స్టాంపుల కృత్రిమ కొరత సృష్టిస్తూ వీటిపై అదనంగా రూ.100 వసూలు చేస్తున్నట్టు సమాచారం.

స్టాంపుల కొరత లేదు

ఎలాంటి స్టాంపుల కొరత లేదు. అత్యధికంగా ఫ్రాంకింగ్ మిషన్ల ద్వారానే స్టాంపింగ్ జరుగుతోంది. చాలా మంది వినియోగదారులు రూ.100 బాండ్లను వినియోగిస్తున్నారు. రూ.100 బాండ్లు కూడా సమృద్ధిగానే ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఇండెంట్లు పెట్టి స్టాంపులను అందుబాటులో ఉంచుతున్నాం. అధిక ధరకు ఎవరైనా స్టాంపులు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. ఎవరైన వెండర్లు అధిక ధరకు స్టాంపులు విక్రయిస్తున్నట్టు సమాచారం ఇస్తే ఆకస్మిక తనిఖీల ద్వారా గుర్తించి శాఖాపర చర్యలు తీసుకుంటాం.

\- కోమటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, నల్లగొండ సబ్ రిజిస్ట్రార్

ప్రజల్లో ఎన్నికలపై ఆత్మవిశ్వాసం కల్పించేలా ఫ్లాగ్ మార్చ్:ఎస్పీ



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నల్లగొండ టౌన్, మార్చి 12: వచ్చే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికలపై ప్రజల్లో ఆత్మవిశ్వాసం కల్పించేలా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్టు ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో పోలీసులు, కేంద్ర సాయుధ బలగాల కవాతును ఆమె ప్రారంభించి మాట్లాడారు. కవాతు క్లాక్‌టవర్, వీటీ.కాలనీ, హనుమాన్ టెంపుల్, శివాజీనగర్, రామగిరి మీదిగా తిరిగి క్లాక్‌టవర్‌కు చేరింది. కార్యక్రమంలోడీఎస్పీ శివరాంరెడ్డి, సీఐలు సత్యనారాయణ, కరుణాకర్, పాల్గొన్నారు.

● హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన ముగ్గురు కానిస్టేబుళ్లకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మెడల్స్ అందజేశారు. అదేవిధంగా ఏహెచ్‌టీయూ విభాగంలో పనిచేస్తూ గుండెపోటుతో మృతి చెందిన కానిస్టేబుల్ నజీర్ భార్య సమ్రీన్‌కు 'చేయూత' కింద రూ.2లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజ్, పాల్గొన్నారు. ● రాష్ట్ర స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో జిల్లాకు 33 పతకాలు రావడంపై క్రీడాకారులతో పాటు కోచ్ యూనుస్ కమాల్‌ను ఎస్పీ అభినందించారు. ఎస్పీ కుమార్తె అద్వైతరెడ్డి 14కిలోల విభాగంలో కాంస పతకం సాధించారు.

వివక్ష లేని సమాజం కోసం కృషి చేయాలి:కలెక్టర్

నల్లగొండ టౌన్, మార్చి 12: ఆడ, మగ వివక్ష లేని సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ దాసరి హరిచందన పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఇంటి పని చేస్తూనే ఉద్యోగాలు చేస్తూ కుటుంబానికి ఆదాయాన్ని సమకూరుస్తున్నారన్నారు. పిల్లలను పెంచడంలో ఎలాంటి వ్యత్యాసాన్ని చూపించవద్దని, ఆడైనా, మగైనా ఒకటేనన్నారు. అప్పుడు మాత్రమే సమాజం మారుతుందన్నారు. ముఖ్యంగా పిల్లలకు విద్యనందించాలని, ప్రత్యేకించి బాలికల చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు, మహిళా ఉద్యోగినులు, పాల్గొన్నారు.

పరీక్షలను సక్రమంగా నిర్వహించాలి

ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీచేసి విద్యార్థుల హాజరును సీఎస్ మున్వర్ అమీనాను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రగతి జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాస్, డీవో ఎంఏ.ఖలీమ్, సాజీద్ మున్వర్, తదితరులు ఉన్నారు.



మహిళాదినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ టౌన్, మార్చి 12: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులను విచారించి ఎలాంటి తప్పులు లేకుండా రూపొందించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్‌ను ముందే గుర్తించాలన్నారు. ఇంటి నుంచే ఓటింగ్ ప్రక్రియ నిర్వహణకు సరైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. పోలింగ్ రోజు రికార్డింగ్ కోసం వెబ్ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వ్యతిరేక వార్తలకు ఎప్పటికప్పుడు స్పందించి ఎన్నికల సంఘానికి పంపించే బాధ్యతను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయాలన్నారు. ఆర్వో కార్యాలయంతో పాటు, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో కమ్యూనికేషన్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని ఈనెల 13 లోగా పంపించాలని, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది వివరాలను అప్‌డేట్ చేయాలన్నారు. అదనపు సీఈవో లోకేష్, సర్ఫరాజ్ అహ్మద్‌లు మాట్లాడుతూ ఓటరు జాబితా, పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ స్టేషన్లో మౌలిక సదుపాయాలు, వివిధ రకాల నోడల్ టీములకు ఇచ్చే శిక్షణ కార్యక్రమాలు తదితర అంశాలను వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరిచందన, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్వో రాజ్యలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఆర్డీవోలు రవి కుమార్, చెన్నయ్య, రాములు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పరిస్థితి అర్థం కావడం లేదు

● పార్లమెంట్‌కు పోటీ చేయాలంటే నేతలు భయపడుతున్నారు ● మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి టెలీ కాన్ఫరెన్స్ వాయిస్ రికార్డ్ వైరల్

నేరేడుచర్ల, మార్చి 12: 'రాష్ట్రంలో బీజేపీ పుంజుకుంటోంది. బీఆర్ఎస్ పరిస్థితి అర్థం కావడం లేదు. పార్లమెంటుకు పోటీ చేయాలంటే ఆ పార్టీ నేతలు చాలామంది భయపడుతున్నార'ని హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన సైదిరెడ్డి నేరేడుచర్ల ముఖ్య కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. చెప్పకుండా వెళ్లడం తప్పేనని, అందుకు క్షమించాలని, కానీ తన వెంట ఉంటారనే నమ్మకంతోనే వెళ్లానని వారికి వివరణ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వాయిస్ రికార్డ్ సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. సైదిరెడ్డి సంభాషణ ఇలా సాగింది. 'ఢిల్లీ రావాలని బీజేపీ ముఖ్యుల నుంచి పిలుపు వచ్చింది. అక్కడికి వెళ్లిన తర్వాత అక్కడున్న పెద్దలు కండువా కప్పుకోవాలన్నారు. పార్లమెంట్ టికెట్ నీకే ఖరారవుతుందన్నారు. ఇప్పుడు నువ్వు కండువా కప్పుకోకపోతే రాష్ట్రంలో బీజేపీ పరువు పోతుందని ఒత్తిడి తెచ్చారు. ఇప్పుడు కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఉంది. మళ్లీ మోదీనే వస్తాడు. వాళ్లు నన్ను కావాలని కోరుకోవడం నాకు మంచిదవుతుందనుకున్న. రాష్ట్రంలో 10నుంచి 12సీట్లు బీజేపీకి వచ్చే అవకాశం ఉంది. టీడీపీ కనుమరుగైపోయింది. బీఆర్ఎస్ పరిస్థితి అర్థం కావడంలేదు. బీజేపీ పుంజుకుంటోంది. ఇప్పుడు మారకపోతే ఆగమైతం అని ఆలోచించిన. రెండుమూడు రోజుల్లో హుజూర్‌నగర్‌కు వచ్చి మీటింగ్ పెడ్తా, నావెంటే ఉండాలి. జై తెలంగాణ' అని సంభాషణ ముగించారు.

చైన్‌స్నాచర్ అరెస్టు

చౌటుప్పల్ రూరల్ మార్చి 12: చైన్‌స్నాచర్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ చేశారు. సీఐ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా రాజ్‌నాయక్‌తండా గ్రామానికి చెందిన హర్యావత్ వెంకన్ననాయక్(32) చౌటుప్పల్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. వెంకన్న బైక్‌పై వచ్చి ఈ నెల 7న చౌటుప్పల్ పట్టణకేంద్రంలో పొట్ట వెంకటేశం మెడ నుంచి రెండు తులాల బంగారు గొలుసును అపహరించి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు వెంకన్ననాయక్‌ను అరెస్టు చేశారు. అనంతరం చౌటుప్పల్ కోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితుడిని నల్లగొండ జైలుకు తరలించారు.

మండలాధ్యక్షులపై అవిశ్వాసాలు పెట్టొచ్చు

- నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోలకు ఉంది
- హైకోర్టు స్పష్టీకరణ .. పలువురి దావాల కొట్టివేత

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు వ్యతిరేకంగా వచ్చిన అవిశ్వాస తీర్మానాలపై సమావేశాలు నిర్వహించే అధికారం ఆర్డీవోలకు ఉందని హైకోర్టు తేల్చిచెప్పింది. పలు మండలాల అధ్యక్షులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. తమకు వ్యతిరేకంగా అవిశ్వాస సమావేశాలు నిర్వహించేలా ఆర్డీవోలు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ ఎంపీపీ ఉమాదేవి, రామన్నపేట్ ఎంపీపీ జ్యోతి, మద్నూర్ ఎంపీపీ లక్ష్మీబాయి, రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వరంగల్ జిల్లా గీసుకొండ ఎంపీపీ సౌజన్య, రంగారెడ్డి జిల్లా మర్రిగూడ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సరూర్‌నగర్ ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, నల్లగొండ జిల్లా చండూర్ ఎంపీపీ పల్లె కల్యాణి, కరీంనగర్ జిల్లా రామడుగు ఎంపీపీ కలగంటి కవిత, ఆదిలాబాద్ జిల్లా ఏలూరు సారంగాపూర్ మండల ఉపాధ్యక్షుడు, జనగాం జిల్లా మల్యాల ఎంపీపీ విమల, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ ఎంపీపీ సువర్ణ, డిచ్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన సుజాత, ప్రభాకర్ తదితరులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్డీవోల నుంచి తమకు అవిశ్వాస నోటీసులు అందాయని, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 263 ప్రకారం ఆ నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోకు లేదని పేర్కొన్నారు. ఈ నోటీసులను కొట్టివేయాలని కోరారు. విచారణ చేపట్టిన జస్టిస్ కే శరత్ ధర్మాసనం నోటీసులు జారీ చేసే అధికారం ఆర్డీవోలకు ఉందని తెలిపింది. సాంకేతిక కారణాలు చూపించి అవిశ్వాసాన్ని తప్పించుకోలేరని పేర్కొంది.

గుదిబండగా కరెంటు ఒప్పందాలు

ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును వాడకున్నా.. రూ.వందల కోట్లలో బిల్లుల బకాయిలు.. న్యాయ విచారణకు సర్కారు నిర్ణయం

- జస్టిస్ నర్సింహారెడ్డితో కమిషన్
- యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లపైనా విచారణ



హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గుదిబండగా మారిన ఛత్తీస్‌గఢ్ కరెంటు ఒప్పందాల దుమ్మును దులపాలని రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటును కొనుగోలు చేయకున్నా.. ప్రస్తుతం ఒక్కయూనిట్ సరఫరా లేకున్నా.. వేల కోట్లలో బిల్లులు కట్టాల్సి రావడంపై న్యాయ విచారణకు ఆదేశించింది. ఇందుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అంతేకాదు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లపైనా ఈ కమిషన్ విచారణ జరుపుతుంది.

ఇదీ ఛత్తీస్‌గఢ్ కరెంటు కథ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. విద్యుత్తు అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2015 సెప్టెంబరు 22న ఛత్తీస్‌గఢ్‌లోని 1,000 మెగావాట్ల మార్వా ప్లాంట్ నుంచి 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ మేరకు పీపీఏ కింద తెలంగాణ డిస్కమ్‌లు, సీఎస్‌పీడీసీఎల్(ఛత్తీస్‌గఢ్) ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అప్పట్లోనే విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. ప్రభుత్వం కౌంటర్ సమర్థనలను చేయిస్తూ.. ముందుకెళ్లింది. ఇక ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు సరఫరాకు వీలుగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్(పీజీసీఐఎల్)తోనూ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ కరెంటును కొనుగోలు చేయకపోవడంతో.. పెనాల్టీ కింద రూ.300 కోట్లను పీజీసీఐఎల్‌కు చెల్లించాలని కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి(సీఈఆర్‌సీ) ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. బకాయిల పేరుతో మార్వా ప్లాంట్ నుంచి విద్యుత్తు సరఫరా జరగకున్నా.. పాయింట్ ఆఫ్ కనెక్షన్ చార్జీలు(పీవోసీ) రూపంలో ఏటా రూ.400 కోట్ల నుంచి రూ.450 కోట్లను చెల్లించాల్సి వస్తోంది. స్థిర చార్జీల భారం కూడా తెలంగాణ డిస్కమ్‌లను వీడడం లేదు. 2020-21లో రూ.828.13 కోట్లు, 2021-22లో రూ.394.98 కోట్ల మేర స్థిరచార్జీలను చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం కాస్తా లేట్‌పేమెంట్‌తో కలుపుకొని రూ.3,576.89 కోట్లకు పెరిగినట్లు ఛత్తీస్‌గఢ్ చెబుతుండగా.. అది కేవలం రూ.2,100 కోట్లేనని తెలంగాణ డిస్కమ్‌లు వాదిస్తున్నాయి. కరెంటు బిల్లుల బకాయిలున్నాయంటూ రెండేళ్ల క్రితమే ఛత్తీస్‌గఢ్ కరెంటు సరఫరా నిలిచిపోయింది. నిజానికి తెలంగాణ డిస్కమ్‌లు 2021-22లో 1,631 మిలియన్ యూనిట్లు(కేవలం 19%) కొనుగోలు చేశాయి. 2022-23 ద్వితీయార్థంలో 2,713 మిలియన్ యూనిట్ల(31%) విద్యుత్తును కొనాలని అంచనాలు వేసినా.. ఆ పరిస్థితి లేదని తేలిపోయింది. 2023-24లో 78% విద్యుత్తు కొంటామనే అంచనాలున్నాయి. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు బకాయిల పేరుతో ఆ మేరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేశాయి. రెండేళ్లుగా కరెంటు సరఫరా లేకున్నా.. 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం బూచీగా ఇప్పుడు తెలంగాణ డిస్కమ్‌లపై భారం పడే ప్రమాదం ఉంది. ఒప్పందంలో ఇంకా ఆరేళ్లు మిగిలే ఉన్నాయి. పీపీఏ ఒప్పందం ప్రకారం విద్యుత్తును కొనకుంటే.. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు ఆ కరెంటును ఓపెన్‌యాక్సెస్‌లో విక్రయించుకోవచ్చు. ఒకవేళ తెలంగాణ ఒప్పందం కంటే.. ఓపెన్‌యాక్సెస్ విక్రయం తక్కువ ధరలో ఉంటే.. ఆ భర్తీని తెలంగాణ డిస్కమ్‌లు భరించాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ బకాయిలన్నీ తెలంగాణ డిస్కమ్‌ల పాలిట గుదిబండగా మారాయి. దీనిపై తెలంగాణ డిస్కమ్‌లు 2018లో విద్యుత్తు అప్పిలేట్ ట్రిబ్యునల్(అప్టెల్)ను ఆశ్రయించినా.. ఆ కేసు తేలేదాకా ఇబ్బందులు తప్పేలా లేవు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన ఈ తొందరపాటు ఒప్పందాలపై ఇప్పుడు రేవంత్ సర్కారు విచారణ జరిపించనుంది. మరోవైపు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లను వినియోగించుకోవాలా? వదిలేయాలా? అంటూ ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. భద్రాద్రిలో ఒక్కో ప్లాంట్ 270 మెగావాట్ల సామర్థ్యంతో.. మొత్తం నాలుగు ప్లాంట్లు 1,080 మెగావాట్లను ఉత్పత్తి చేస్తాయి. ఈ ప్లాంట్‌పై అప్పట్లోనే తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. సబ్-క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్ కట్టడంపై నిపుణులు విమర్శలు చేశారు. 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి ప్లాంట్ ఇంకా నిర్మాణంలోనే ఉంది. ఇక్కడ కూడా భూసేకరణ, టౌన్‌షిప్‌ల నిర్మాణం, సబ్-కాంట్రాక్టుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ అంశాలపైనా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ జరపనుంది.

ఫలించిన 15 ఏళ్ల నిరీక్షణ

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల డీఎస్సీ 2008 అభ్యర్థుల హర్షం
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరిగిందని ఆనందం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008లో అర్హత పొంది, నియామకాలు పొందని అభ్యర్థులకు కనీస వేతనాల పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తాము 15 ఏళ్లుగా పడుతున్న కష్టాల నుంచి ప్రభుత్వ ప్రకటనతో ఉపశమనం కలిగిందన్నారు. మంగళవారం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద అభ్యర్థులు, అసోసియేషన్ ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... దశాబ్దంనర కాలంగా ఎదురుచూపులు నేడు ఫలించాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తమకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి, తమకు కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకొచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో పాటు ఇతర అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. త్వరగా విధివిధానాలు ప్రకటించాలని వారు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 'డీఎస్సీ 2008 అసోసియేషన్' అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాకు ఉద్యోగాలు ఇవ్వండి

- డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ టీచర్ల మొర
- వేర్వేరు సమస్యలపై 'ప్రజావాణి'కి 1470 అర్జీలు



పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న బాలుడు గౌతమ్

సికింద్రాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తమకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలంటూ డీఎస్సీ 1998లో అర్హత సాధించిన ఉపాధ్యాయులు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. 1998 డీఎస్సీలో నియామక ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందని, ఎన్నికలు రావడంతో 1999లో డీఎస్సీ ప్యానల్‌ను రద్దు చేశారన్నారు. దాంతో డీఎస్సీ-98లో క్వాలిఫై అయిన అభ్యర్థులు ఉద్యోగావకాశాలు కోల్పోయారని తెలిపారు. ఈ మేరకు ప్రజాభవన్‌కు తరలివచ్చిన పలువురు అభ్యర్థులు ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు. ఇదే కాదు.. రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణి సమస్యలు, ఉద్యోగాలు, వైద్యంతోపాటు వేర్వేరు సమస్యలపై ప్రజావాణికి మంగళవారం 1,470 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ పరమైన సమస్యలు 327, ఇంటి కోసం 251, పంచాయతీరాజ్ విభాగానికి 200, మైనార్టీ వెల్ఫేర్ సంబంధించి 145అర్జీలు ఉన్నాయి. ఆయా దరఖాస్తులను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జీ.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య, ఇతర అధికారులు ప్రజలను స్వీకరించారు. సంబంధిత విభాగాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, పుట్టుకతో అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేయాలని నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన దండు గౌతమ్ (13) దరఖాస్తు చేసుకున్నాడు. ఆరో తరగతి విద్యార్థి అయిన గౌతమ్ లేచి నిలబడాలన్నా, కూర్చోవాలన్నా ఇతరులపై ఆధారపడే స్థితిలో ఉన్నాడు. అలాగే, రైలు ప్రమాదంలో తగిలినగాయాల వల్ల తన కాలు, చెయ్యి పని చెయ్యడం లేదని, ఆర్థిక సమస్యల్లో ఉన్న కుటుంబాన్ని పోషించుకునేందుకు తనకు ఉద్యోగం ఇప్పించాలని నాంపల్లి నేతాజీనగర్‌కు చెందిన జి.శశికాంత్ దరఖాస్తు చేసుకున్నారు. ఉప్పల్‌కు చెందిన పలువురు వృద్ధ మహిళలు తమకు పెన్షన్ మంజూరు చేయాలని, అంబర్‌పేటకు చెందిన పలువురు మహిళలు రేషన్ కార్డు కోరుతూ అర్జీలు పెట్టారు. కాగా, తమ ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని, వేతనాన్ని రూ.19,500కు పెంచాలని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్ స్వీపర్లు అర్జీ చేసుకున్నారు. గత ప్రభుత్వం తీరు వల్ల 1500 మంది అభ్యర్థులు ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన జూనియర్ లైన్‌మెన్లు అభ్యర్థించారు. బేగంపేట్‌లోని ఈశ్వరీయ విశ్వ విద్యాలయ కేంద్రంలో నిర్వహించే ఆధ్యాత్మిక తరగతులకు తమ ను రానివ్వడం లేదంటూ పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు.



అంటువ్యాధుల నివారణ కోసం నిర్మించబోయే ప్రయోగశాల భూమిపూజలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

అంటువ్యాధుల నివారణకు ప్రయోగశాల

- 25 కోట్లతో ఐఐపీహెచ్ ఆవరణలో ఏర్పాటు
- హిమాయత్‌సాగర్‌లో భూమిపూజ
- భవిష్యత్‌లో పలు పరిశోధనలు

రాజేంద్రనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు హిమాయత్‌సాగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఐఐపీహెచ్) ఆవరణలో రూ.25 కోట్లతో ప్రయోగశాల(సైరస్ పూనావాలా సెంటర్ ఫర్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ అండ్ పాండమిక్ ప్రిపేర్డ్‌నెస్) నిర్మించనున్నట్లు ఐఐపీహెచ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటల తెలిపారు. ఈ సెంటర్‌కు భూమిపూజను విల్లో పూనావాలా ఫౌండేషన్ సీఈవో జస్వీందర్ నారంగ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ సి. శ్రీనివాస రాజు, ఐఐపీహెచ్ చీఫ్ మెంటార్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సంజయ్ జొడెపె, యూఎస్‌ఏకు చెందిన డాక్టర్ అనిల్ కౌల్‌తో కలిసి మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సెంటర్ అంటువ్యాధులను ఎదుర్కోవడానికి అంకితమైన మార్గదర్శక కేంద్రంగా పనిచేస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలను సూచించడంలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ వారు క్యాన్సర్ స్క్రీనింగ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో సుమారు రూ.10 కోట్ల విలువ చేసే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే బస్సును ఐఐపీహెచ్‌కు బహూకరించారు. ఈ బస్సులో ఇక మీదట గ్రామాల్లో తిరుగుతూ మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మూడు బోర్లు వేసి అప్పుల పాలై రైతు ఆత్మహత్య

- మెదక్ జిల్లాలో కిష్టాపూర్‌లో ఘటన
- విద్యుదాఘాతంతో మహిళా రైతు, ఎలక్ట్రీషియన్ మృతి

చేగుంట, అడ్డగూడూరు, కోదాడ రూరల్, మార్చి 12: చేతికొచ్చే సమయంలో పంట ఎండిపోకూడదని మూడు బోర్లు వేయించినా చుక్క నీరు రాకపోగా.. అప్పుల పాలవ్వడంతో కలత చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధి కిష్టాపూర్‌కు చెందిన కుర్మ స్వామి(30) అనే రైతు తన పొలంలోని చెట్టుకు మంగళవారం ఉరి వేసుకుని మరణించాడు. కుర్మ స్వామి తనకున్న నాలుగు ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేశారు. బోర్లు వేసేందుకు, పంట సాగుకు సుమారు నాలుగు లక్షల అప్పు చేశారు. నీళ్లు రాక పొలం ఎండిపోగా, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుర్మ స్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, పొలంలో కింద పడి ఉన్న 11కేవీ త్రీఫేజ్ మెయిన్ వైరును తొక్కి, విద్యుదాఘాతానికి గురై యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామానికి చెందిన బోనాల లక్ష్మి(40) అనే మహిళా రైతు ప్రాణాలు కోల్పోయారు. లక్ష్మి రోజు మాదిరిగా మంగళవారం సాయంత్రం పొలంకు వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ఇక, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన షేక్ జానీమియా(35) అనే ఎలక్ట్రీషియన్ తన ఇంట్లో తెగిన విద్యుత్ తీగకు మర్మమతుల చేస్తూ విద్యుదాఘాతానికి గురై మరణించాడు.

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో 4,356 అధ్యాపక పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం
- నోటిఫికేషన్ జారీ.. 16న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు
- నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి దామోదర

పోస్టులు	ఖాళీల సంఖ్య	వేతనం (రూ.లలో)
ప్రొఫెసర్	498	1,90,000
అసోసియేట్ ప్రొఫెసర్	786	1,50,000
అసిస్టెంట్ ప్రొఫెసర్	1459	1,25,000
సీనియర్ రెసిడెంట్స్	1201	92,575
ట్యూటర్స్	412	55,000

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీర్చేందుకు రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 2021 అక్టోబరు నుంచి ఖాళీగా ఉన్న 4,356 టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయాలన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నం.98 విడుదల చేసింది. ఇందులో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీతో ఏటా సర్కారుపై అదనంగా రూ.634 కోట్ల భారం పడుతుందని మంత్రి తెలిపారు. మెడికల్ కాలేజీల్లోని అధ్యాపకుల నియామకాలన్నీ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీల ద్వారా సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల బలోపేతం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జాతీయ వైద్య కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడానికి పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. కాగా, కాలేజీల వారీగా పోస్టుల వివరాలను ఆయా కాలేజీల వెబ్‌సైట్లలో పొందుపర్చారు. కాలేజీల వెబ్‌సైట్ల వివరాలు డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో (htpps://dme.telangana.gov.in) ఉన్నాయి. అన్ని కాలేజీల్లో ఈ నెల 16న వాక్-ఇన్-ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అర్హతలున్న అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

లోక్‌సభ ఎన్నికలకు ఖర్గే దూరం!

- ఒక నియోజకవర్గానికే పరిమితం కాదలుచుకోలేదు: ఏఐసీసీ చీఫ్
- దేశవ్యాప్తంగా దృష్టి పెడతానని వెల్లడి
- గుల్బర్గా నుంచి అల్లుడిని దింపే చాన్స్

న్యూఢిల్లీ, మార్చి 12: ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ ఎన్నికలు అత్యంత కీలకమని, పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. తాను కూడా పోటీ చేస్తే ఒక నియోజకవర్గంపైనే దృష్టి పెట్టి, అక్కడే పరిమితం కావాల్సి ఉంటుందని ఖర్గే అభిప్రాయపడ్డారు. అయితే, పార్టీ వర్గాలు మాత్రం ఆయన పోటీ చేయాలని కోరుకుంటున్నాయి. ఈ ఎన్నికలను వదులుకోకూడదని, పోటీలో ఉండే పార్టీని ముందుండి నడిపించాలని వారు చెబుతున్నారు. కానీ, వీరి వాదనను ఖర్గే తోసిపుచ్చుతున్నారు. "రానున్న ఎన్నికలు అత్యంత కీలకం. పార్టీ చీఫ్‌గా ఒకే నియోజకవర్గానికి పరిమితం కాలేను. దేశవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలపైనా దృష్టిపెట్టాల్సి ఉంది" అని ఖర్గే తెలిపారు. కర్ణాటకలోని గుల్బర్గా నియోజకవర్గం నుంచి ఖర్గేని రంగంలోకి దింపాలని గత వారం జరిగిన సమావేశంలో నేతలు ఏకగ్రీవంగా భావించారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును జాబితాలోనూ చేర్చారు. అయితే, ఖర్గే పోటీకి దూరంగా ఉండి, ఈసారి తన అల్లుడు రాధాకృష్ణన్ దొడ్డమానిని బరిలో నిలపాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. గుల్బర్గా నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు విజయం సాధించిన ఖర్గే 2019 ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పెద్దల సభలో విపక్ష నాయకుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. మరో నాలుగేళ్లు ఆయన పదవీ కాలం ఉంది. ప్రస్తుతం ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే సిద్దరామయ్య మంత్రి వర్గంలో కేబినెట్ మంత్రిగా ఉన్నారు. తొలుత ప్రియాంక్‌ను పార్లమెంటు బరిలో నిలపాలని అనుకున్నా.. తర్వాత ఈ నిర్ణయాన్ని పార్టీ వెనక్కి తీసుకుంది. ఇదిలా ఉంటే, ఖర్గే కనుక పోటీ చేయకపోతే, ఏఐసీసీ అధ్యక్షులుగా ఉండి ఎన్నికలకు దూరంగా ఉన్న వారిలో ఈయనే తొలి నాయకుడు అవుతారు.

త్వరలో సాగర్‌లో బస్తీ దవాఖానా ప్రారంభం

నాగార్జునసాగర్, మార్చి 12 : అసంపూర్తి పనులు పూర్తి చేసి త్వరలో నందికొండలో బస్తీ దవాఖానాను ప్రారంభిస్తామని డీఎంహెచ్‌వో కొండల్‌రావు తెలిపారు. జిల్లాకు మంజూరైన ఏడు ఆసుపత్రుల్లో ఆరింటిని ఇదివరకే ప్రారంభించామన్నారు. మంగళవారం నందికొండ మునిసిపాలిటీలో నూతనంగా ప్రారంభించనున్న బస్తీ దవాఖానాను పనులను ఆయన పరిశీలించారు. దవాఖానాకు సంబంధించి కొన్ని అసంపూర్తి పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. వాటిని పూర్తి చేయించి ప్రారంభానికి సిద్ధం చేస్తామన్నారు. డీఎంహెచ్‌వో వెంట అరుంధతి, ఉమా, నగేశ్, వినల్ కుమార్, లింగయ్య, తిరుమలచారి, సావిత్రమ్మ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల డీవో విధుల నుంచి తొలగింపు

కొండమల్లేపల్లి, మార్చి 12: ఇంటర్ పరీక్షా కేంద్రంలో మహిళా ఇన్విజిలేటర్‌తో దురుసుగా వ్యవహరించిన డిపార్ట్‌మెంట్ ఆఫీసర్(డీవో)ను విధుల నుంచి తొలగించారు. కొండమల్లేపల్లిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. డిండి ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు బత్తుల సాయిలు ఈ కేంద్రానికి డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 2వ తేదీన పరీక్షాకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఇన్విజిలేటర్(లెక్చరర్)తో సాయిలు దురుసుగా మాట్లాడారు. దీంతో ఆమె సాయిలుపై జిల్లా ఇంటర్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేయగా, విచారణ అనంతరం విధుల నుంచి తొలగించినట్లు డీఐఈవో దస్రూనాయక్ మంగళవారం తెలిపారు. సైదులు స్థానంలో డిండి ప్రభుత్వ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న పాండురంగయ్యను డీవోగా నియమించారు. ఇదిలా ఉండగా గతంలోనూ డిండి మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో నిర్వహించిన ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు సాయిలును విధుల నుంచి తొలగించారు.

కాంగ్రెస్‌లోకి ఎవరినీ చేర్చుకోవద్దు



ఆమరణ దీక్ష చేస్తున్న రమేష్

మిర్యాలగూడ, మార్చి 12 : కాంగ్రెస్ పార్టీలోకి ఎవరినీ చేర్చుకోవద్దని కోరుతూ కాంగ్రెస్ నాయకులు బంటు రమేష్ మంగళవారం ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి ఏ పార్టీ వచ్చినా ఆ పార్టీలో చేరేందుకు కొందరు నాయకులు తహతహలాడుతున్నారని, దశాబ్దకాలంగా పార్టీని బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడ్డారన్నారు. జెండా మోశారని గుర్తుచేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లో చేరేందుకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కాంట్రాక్టర్లు రాయబారాలు చేస్తున్నారన్నారు. పార్టీ అధిష్టానం సూచన మేరకు పార్టీలో ఎవరికీ చేర్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో సైదిరెడ్డి, వెంకన్న, వీరయ్య, సుధాకర్, వెంకటేష్, పద్మ, లక్ష్మమ్మ, అంజమ్మ పాల్గొన్నారు. కాగా సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌లో రమేష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. త్వరపడి ఎవరినీ చేర్చుకోవడం లేదని, దీక్ష విరమించాలని సూచించడంతో ఆయన రాత్రి దీక్షను విరమించారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంసీపీఐ, బీఎల్ఎఫ్ నాయకులు

మిర్యాలగూడ, మార్చి 12 : మతోన్మాద బీజేపీని ఓడించేందుకు అందరూ ఏకం కావాలని బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు. ఎంసీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర విధానాలతో దేశం వెనక్కి పోతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు నష్టపోతుండగా కార్పొరేట్ శక్తులు బలపడుతున్నాయని ధ్వజమెత్తారు. అసమానతలు పెరిగాయని, దోపిడీలు పెరిగాయన్నారు. అనంతరం కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంసీపీఐ, బీఎల్ఎఫ్ జాతీయ, రాష్ట్ర నాయకులు గాదగోని రవి, వస్కుల మట్టయ్య, మారోజు సునీల్‌కుమార్, భరత్, పాండురంగాచారి, మోహన్‌నాయక్, కాశీ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులకు పీఎఫ్ వర్తింపజేయాలి

రామగిరి, మార్చి 12 : నల్లగొండ మునిసిపల్ కార్యాలయంలో ఐదేళ్లుగా పనిచేస్తున్న 110మంది కార్మికులకు వెంటనే పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపచేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, సహాయకార్యదర్శి దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈఎస్ఐ, పీఎఫ్ అమలుచేయాలని కోరుతున్న కార్మికులపై బెదిరింపులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, సునీత, జానయ్య, రాము, సైదమ్మ, నాగరాజు, నగేష్ ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాన్ని సాధించాలి



వల్లాల మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

శాలిగౌరారం, మార్చి 12 : విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని శాలిగౌరారం సీఐ సీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో వల్లాల మోడల్ స్కూల్, కస్తూర్బా బాలికల పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులను సీఐ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. చైత్ర ఫౌండేషన్ వారు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు అంకితభావంతో చదువుతూ తల్లిదండ్రులతో పాటు సమాజానికి గుర్తింపు తెస్తూ భావి భారత పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జీ రాగిణి, లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మాజీ సర్పంచ్ బండపెల్లి కొమరయ్యగౌడ్, కేజీబీవీ ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై పునరాలోచించాలి



కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ సిబ్బంది నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండటౌన్, మార్చి 12: అంగన్‌వాడీ కేంద్రాల్లో బయోమెట్రిక్‌తో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ చాలా ఏళ్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలు, వాటి పరిష్కారాల గురించి ప్రభుత్వాలు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ కుటుంబ సర్వేలు చేయాలని, బీఎల్‌వో డ్యూటీలు చేయాలని పలు ప్రభుత్వ పనులు అప్పజెప్పి స్కీం ఉద్దేశాన్ని నెరవేరనీయడం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటిపూట బడి నిర్వహించడంతో పాటు మేల నెల మొత్తం వేసవి సెలవులు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒప్పందాలను అమలుచేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన పాక లక్ష్మీనారాయణ, టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ ఆన్‌లైన్ సర్వేలు చేయించి చిన్న పిల్లలకు సేవలు అందించకుండా ప్రభుత్వం ఇతర పనులకు ఉపయోగిస్తోందని ఆరోపించారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయకార్యదర్శి దండంపల్లి సత్తయ్య, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే విజయలక్ష్మీ, జిల్లా కార్యదర్శి బీ పార్వతి, సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి చింతపల్లి బయన్న, ఆదిమల్ల సుధీర్, నాయకులు సుభాషిని, సరిత, సముద్రమ్మ, సునంద, శోభ, లూర్దుమేరి, అరుణ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

వేములపల్లి / నకిరేకల్, : అపరిష్కృతంగా ఉన్న ఆశా వర్కర్ల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు రొండి శ్రీనివాస్ కోరారు. మంగళవారం వేములపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారికి ఆశాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేసి, మాట్లాడారు. కార్యక్రమంలో ఆశాలు రాధిక, సుజాత, దేవకమ్మ, కవిత, రేణుక, లక్ష్మీ, రజిత పాల్గొన్నారు. అదేవిధంగా నకిరేకల్‌లో టీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్ మాట్లాడుతూ రెండేళ్లుగా బకాయి ఉన్న ఆశా వర్కర్ల వేతనాలను విడుదల చేయాలన్నారు. ఈ మేరకు మంగళవారం నల్లగొండలో డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గుర్రం వెంకటరెడ్డి, వెంకటేశం, పారతమ్మ, జయమ్మ, సైదమ్మ, సునీత, లక్ష్మి, శ్రీలత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ బిల్లులను చెల్లించాలి

నార్కట్‌పల్లి: ఉపాధిహామీ కూలీల బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మాండ్ర, తిరుమలగిరి గ్రామాల్లో ఉపాధి కూలీలను కలిసి వారితో మాట్లాడారు. ఎండలను సైతం లెక్కచేయకుండా పనులు చేస్తున్న కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ఆయన వెంట వ్య.కా.స జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి చెర్కు పెద్దులు, ఏర్పుల లింగస్వామి, వంగాల బుచ్చమ్మ, తోటకూరి జాలమ్మ, బెల్లి స్వప్న, బోడ అలివేలు, ఐలమ్మ పాల్గొన్నారు.

కార్గో సేవలతో యువతకు ఉపాధి: బడుగుల



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు లింగయ్యయాదవ్

మాడ్గులపల్లి, మార్చి 12: కార్గో సేవలు అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంత యువతకు ఉపాధి లభిస్తుందని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. భారతీయ రైల్వే ఆధునీకరణలో భాగంగా మంగళవారం మండలంలోని కొత్తగూడెం గ్రామం వద్ద ఎఫ్‌సీఐ గోదాంలో కార్గో సేవలను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం గ్రామంలో ఎంపీ లింగయ్యయాదవ్ పాల్గొని మాట్లాడుతూ కార్గో సేవలతో హమాలీకి తక్కువ సమయంలోనే పనులు పూర్తవుతాయన్నారు. గోదాంలు ఉన్న ప్రతీచోట కార్గో సేవలను ఏర్పాటుచేయాలని ఆయన కోరారు. రైల్వేశాఖ ఎఫ్‌సీఐలను అభివృద్ధి చేయాలని ఆయన సూచిం చారు. కార్యక్రమంలో వల్లపురెడ్డి కోటిరెడ్డి, సిరిగిరెడ్డి రాంరెడ్డి, జిల్లా శ్రీనివాస్‌రెడ్డి, పసునూరి ప్రహ్లాద్, సుశీల్‌కుమార్, సుధాకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకాపరి ఆత్మహత్య

వేములపల్లి, మార్చి 12: మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గొర్రెలకాపరి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వేములపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం అజలాపురం గ్రామానికి చెందిన కాకుంట్ల మహేష్(22) గొర్రెలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన గ్రామానికి చెందిన బాబాయి కాకుంట్ల శ్రీశైలంతో పాటు మరికొందరు కాపరులతో కలిసి గొర్రెలు కాస్తూ ఈ నెల 7వ తేదీన వేములపల్లికి చేరుకున్నారు. అప్పటినుంచి వేములపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో గొర్రెలను మేపుతున్నారు. సోమవారం రాత్రి తోటికాపరి కొర్ర భాస్కర్‌తో కలిసి భోజనం తిని నిద్రించాడు. మంగళవారం ఉదయం భాస్కర్ నిద్రలేచేసరికి మహేష్ సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. భాస్కర్ విషయాన్ని మహేష్ బాబాయి శ్రీశైలంకు సమాచారం అందించాడు. ఘటన విషయం తెలుసుకున్న పోలీసులు మహేష్ మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మహేష్ బాబాయి శ్రీశైలం ఫిర్యాదు మేరకు చేసుకుని, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మహేష్ కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. మహేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదన్నారు.

రైలుకిందపడి వ్యక్తి బలవన్మరణం



ఉపేందర్(ఫైల్‌ఫోటో)

మిర్యాలగూడ అర్బన్, మార్చి 12: రైలు కిందపడి యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మిర్యాలగూడ పట్టణంలో మంగళవారం జరిగింది. రైల్వే ఎస్ఐ సాలకమ్మ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పంగ ఉపేందర్(37) ప్లంబర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం తెల్లవారుజామున రైలు పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. సోమవారం రాత్రి తన స్నేహితుడికి ఫోన్ చేసినట్లు సెల్‌ఫోన్ కాల్‌డాటాలో గుర్తించినట్లు రైల్వేఎస్ఐ తెలిపారు. కాల్‌లిస్ట్‌లో ఉన్న నెంబరు ఆధారంగా విచారణ జరపగా పట్టణానికి చెందిన వ్యక్తిగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చినట్లు తెలిపారు. తన స్నేహితుడితో రైల్వే స్టేషన్‌కు వెళ్తున్నట్లు సమాచారం ఇచ్చి గుర్తుతెలియని రైలుకింద పడిఆత్మహత్య చేసుకున్నాడు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లుగా భావిస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఉపేందర్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. మృతదేహానికి స్థానిక ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

24క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మునుగోడు, మార్చి 12: మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో పౌర సరఫరాల అధికారులు మంగళవారం దాడులు జరిపారు. ఓ ఇంట్లో అనధికారికంగా 48బస్తాల్లో నిల్వ ఉంచిన సుమారు 24క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకోవటంతో పాటు నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చండూరు పౌర సరఫరాల శాఖ నాయబ్ తహసీల్దార్ విజయ తెలిపారు. రేషన్ బియ్యాన్ని అక్రమాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

కుమ్మరిగూడెంలో యువతి అదృశ్యం



మహేశ్వరి

నిడమనూరు, మార్చి 12: మండలంలోని వేంపాడ్‌లోని శివారు కుమ్మరిగూడెం గ్రామంలో యువతి అదృశ్యమైంది. ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చిట్టిమళ్ల సత్యనారాయణకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె మహేశ్వరి(25) హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తుంది. సెలవులు ఉండడంతో ఇటీవల ఇంటికి వచ్చింది. ఈక్రమంలో మంగళవారం మహేశ్వరీ తల్లిదండ్రులు ఎప్పటిమాదిరిగానే పొలం పనులకు వెళ్లి మధ్యాహ్నం వచ్చేసరికి వారికి ఇంట్లో కుమార్తె కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో తన కుమార్తె కనిపించడం లేదని తండ్రి సత్యనారాయణ మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 521మంది గైర్హాజరు

నల్లగొండ, మార్చి 12 : జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 13,898 మందికి 13,377మంది హాజరు కాగా 521 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 12,096 మందికి 11,748మంది హాజరు కాగా, 348మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1802మందికి 1629మంది హాజరు కాగా 173మంది హాజరు కాలేదు. జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదు.

అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ నినాదం: ఎమ్మెల్యే



ఏపీలింగోటంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, మార్చి 12 : అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వ నినాదమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని నార్కట్‌పల్లి, ఏపీలింగోటం, బీ.వెల్లెంల, శాపల్లి తదితర గ్రామాల్లో ఉపాధి నిధులు రూ.80లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని 100 రోజులు గడవక ముందే ప్రజలు కితాబునిస్తున్నారని తెలిపారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఖచ్చితంగా అమలు చేస్తోందన్నారు. ఇదిలా ఉండగా రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న బీ.వెల్లెంలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త సోమనబోయిన యాదయ్య, సురేశ్‌లను ఎమ్మెల్యే వీరేశం పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, మాజీ ఎంపీపీ పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, బండా సాగర్‌రెడ్డి, అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, సట్టు సత్తయ్య, రేగట్టె నర్సిరెడ్డి, నూకల శంకర్, గడ్డం పశుపతి, జెరిపోతుల భరత్, గాయం శ్యాంసుందర్‌రెడ్డి, డీఈఈ రమేశ్, ఏఈ పాల మోహన్, చిరుమర్తి ధర్మయ్య, బొడిగె నర్సింహ, వెల్లెంల గోపాలు, చెరుపల్లి రఘుపతి, కాసం అశోక్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం: శ్యాంసుందర్

తిప్పర్తి, మార్చి 12 : రాష్ట్ర పుణిగిరి క్షత్రీయ పెరిక కుల సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్తినేని శ్యాంసుందర్ అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా మంగళవారం రాష్ట్ర కేబినెట్ సమావేశంలో అమలుచేసి మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా పెరిక కులానికి చెందిన జూకూరి రమేష్ నియామకంపై మంత్రి తీసుకున్న చొరవపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

పదో తరగతి విద్యార్థుల సందేహాల నివృత్తికి కృషి: డీఈవో

నల్లగొండ, మార్చి 12 : పదో తరగతి విద్యార్థుల సందేహాల నివృత్తికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు డీఈవో భిక్షపతి ఒక ప్రకటనతో తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఏమైనా సందేహాలు ఉంటే ఈ నెల 15వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫోన్ ద్వారా నిపుణులతో సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఫోన్ నెంబర్లు 9121212513, 7989819053కు సంప్రదించాలని కోరారు. 26వ తేదీన సైన్స్ పార్ట్ -1(భౌతికరసాయనశాస్త్రం), సైన్స్‌పార్ట్ -2(జీవశాస్త్రం) పరీక్షలు ఉదయం 9.30గంటల నుంచి 11గంటల వరకు జరుగుతాయని, మిగతా అన్ని పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జూకూరి రమేష్

నల్లగొండ, మార్చి 12: నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జూకూరి రమేష్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. చైర్మన్‌తో పాటు మరో 14మందితో కమిటీని ప్రకటించారు. వైస్‌చైర్మన్‌గా జూలకంటి వెంకట్‌రెడ్డి, సభ్యులుగా వజ్జ సత్యనారాయణ, ఎల్ల రవీందర్‌రెడ్డి, మల్లెబోయిన ఆంజనేయులు, తంగెళ్ల యాదగిరిరెడ్డి, గంటెకంపు సైదులు, వడాల జానయ్య, నల్లబోతు సైదిరెడ్డి, పులకరం సుజాత, షేక్ కరీముల్ల, మేగావత్ శ్రీనులతో పాటు తిప్పర్తి పీఏసీఎస్ చైర్మన్‌ను, జిల్లా వ్యవసాయ మార్కెట్ ఏడీని, మునిసిపల్ చైర్మన్‌ను కమిటీల్లో సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేస్తూ రైతుల అవసరాలకు అనుగుణంగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని కోరారు.



హాలియా: జిల్లాలో ఐదు పాఠశాలల నుంచి ఎంపిక చేసిన 50 మంది విద్యార్థులను ఈనెల 12 నుంచి 14 వరకు పర్యావరణ అధ్యయనంపై నాగార్జునసాగర్‌లో నేచర్ క్యాంపునకు పంపించారు. అందులో అనుముల మండలం నుంచి కొత్తపల్లి పాఠశాల విద్యార్థులు తరలివెళ్లారు.

దేవరకొండ: దేవరకొండ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నల్ల వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం ప్రతినిధుల బృందం దేవరకొండ మండలంలోని కర్నాటిపల్లి, అంబోతుతండా, జాల్ తండా గ్రామాల్లో ఎండిపోయిన పొలాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బిజిలి లింగయ్య, నరేష్, రమేష్, చందర్ పాల్గొన్నారు.

పెద్దవూర: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంద నరేందర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

తిరుమలగిరి(సాగర్): మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఎంఎన్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, ఫౌండేషన్ సభ్యులు రాజేష్, పరమేష్, కృష్ణ, రజాక్ పాల్గొన్నారు.

చిట్యాల: స్థానిక ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఆసరా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ పరీక్షా సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంఈవో నర్సింహ్మ, ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న శ్రీ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ఘనంగా స్వపరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. వివిధ పాత్రల్లో విద్యార్థులు ఒదిగిపోయారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కరస్పాడెంట్ వీరమళ్ళ సతీష్‌కుమార్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కృష్ణారెడ్డి, రమణ, బిక్షం, హెచ్ఎం వెంకట్‌రమణచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిట్యాల: బీఆర్ఎస్ పార్టీకి మునిసిపల్ 10వ వార్డు కౌన్సిలర్ కౌన్సిలర్ సిలివేరు మౌనికశేఖర్ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వార్డు ప్రజలతో చర్చించి ఏ పార్టీలో చేరాలో తెలియజేస్తానన్నారు.

మర్రిగూడ: మండల కేంద్రంలో రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య ప్రారంభించారు.

మర్రిగూడ: ఎరుగండ్లపల్లి గ్రామ కంఠ మహేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి మాజీ ఎంపీపీ అనంత రాజుగౌడ్ రూ.25వేలను విరాళంగా అందజేశారు.

చిట్యాలరూరల్: ఇరవై ఏళ్ళుగా పార్టీలో ఉండి తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో పాల్గొన్నా తమకు అన్యాయం జరిగిందనే బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరామని తెలంగాణ ఉద్యమ నాయకుడు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ తెలిపారు.

కట్టంగూరు: కట్టంగూరు పశువుల సంతవేలం వాయిదా వేసినట్లు ఇన్‌చార్జి డీఎల్‌పీవో అథర్ పర్వేజ్ తెలిపారు. తైబజార్ వేలం పాటను కట్టంగూరుకు చెందిన పంతంగి రాములు రూ.1.75లక్షలకు పాట పాడి దక్కించుకున్నట్లు తెలిపారు.

నార్కట్‌పల్లి: మండలంలోని నార్కట్‌పల్లి, అమ్మనబోలు పశువుల సంతల వేలాన్ని నిర్వహించారు. నార్కట్‌పల్లి పరిధిలో వేలాన్ని దూదిమెట్ల శ్రీనివాస్ రూ.46.02లక్షలకు, తైబజార్‌ను వడ్డేపల్లి నాగరాజు రూ.1.60లక్షలకు దక్కించుకున్నారు. అమ్మనబోలు సంత వేలం హక్కును కన్నెబోయిన వెంకటాద్రి రూ.32.01లక్షల కైవసం చేసుకున్నారు.

రామగిరి: నల్లగొండ పట్టణంలో నిర్వహించే వివిధ అభివృద్ధి పనులపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం ఉదయం మునిసిపల్ కార్యాలయంలోని సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. అంతకు ముందు బైపాస్ రోడ్డులోని రూ.54కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు, ఎన్‌జీ కళాశాల వద్ద రూ.1.50కోట్లతో పనులకు శంకుస్థాపన చేస్తారు.

చింతపల్లి: చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహోత్సవాలు ముగిసాయి.

నకిరేకల్ : కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పాలెం గ్రామానికి చెందిన నోముల మహేష్, నోముల మల్లేష్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి యేసుపాదం తెలిపారు.

శాలిగౌరారం : మనిమిద్దె గ్రామంలో శివాలయ నిర్మాణానికి చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్ రూ.50,116 నగదును ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు.

దేవరకొండ: కమలాపూర్ వీరభద్రస్వామి ఆలయ బ్రహోత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

వేములపల్లి: ఆరు గ్యారెంటీ హామీల అమలును హర్షిస్తూ వేములపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు బొంగర్ల వినోద్ క్షీరాభిషేకం చేశారు. ఆయన వెంట బచ్చలకూరి కోటేష్, వెంకన్న, శ్రీకాంత్, పిచ్చయ్య పాల్గొన్నారు.

మాడ్గులపల్లి : తోపుచర్ల పరిధిలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులను జడ్పీటీసీ పుల్లెంల సైదులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంగా యాదయ్య, నాయకులు ఎరుకలి వెంకన్న, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి, మీసాల నాగేందర్, భరత్, దేవయ్య, శ్రవణ్, అంజి, పాల్గొన్నారు.

నకిరేకల్: 'సమానత్వంతో కూడిన మహిళా సాధికారత' అనే అంశంపై నకిరేకల్‌లో టీఎస్‌యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహిళా కన్వీనర్ చింతమల్ల వరలక్ష్మీ, నకిరేకల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునిత, సుందరి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

చందంపేట: ఉపాధి పనులలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ పీడీ నవీన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 2022-23 సంవత్సరానికి రూ.3.67 కోట్ల ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీ, జడ్పీటీసీ బుజ్జి లచ్చిరాం పాల్గొన్నారు.

వేములపల్లి: మిల్లర్లు చేస్తున్న దోపిడీని అరికట్టాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

మర్రిగూడ: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల, గ్రామభారతీ ఆవాస కేంద్రాన్ని రాష్ట్ర బాలల హక్కు పరిరక్షణ కమిషన్ కమిటీ సభ్యులు పొనుగోటి అంజన్‌రావు తనిఖీచేశారు. పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక తరగతులకు హాజరు కాని ఉపాధ్యాయులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

నల్లగొండ కల్చరల్: వైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని ప్రముఖ న్యాయవాది నాంపల్లి నర్సింహ, పట్టణ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు భాగ్య ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

మిర్యాలగూడ టౌన్: గ్రూప్స్ పోస్టుల సంఖ్య పెంచాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. లక్షలాది మందికి గ్రూప్స్ నోటిఫికేషన్ విడుదల చేయడం ఊరటనిచ్చే విషయమన్నారు. వెంటనే పోస్టుల సంఖ్య పెంచాలని డిమండ్ చేశారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, అంజి, శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి: మండల కేంద్రంలోని నర్సరీని డ్వామా ఏపీడీ నర్సింహా పరిశీలించారు. ఎండిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు పెంచాలన్నారు.

నల్లగొండ: బీసీల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నాయకురాలు కవితకు లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గండిచెరువు వెంకన్న గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు.పూలే విగ్రహం పెట్టాలని వినతిపత్రాన్ని ఇచ్చినా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని వందేభారత్ రైలు నిలుపుట హర్షనీయమని బీజేపీ నాయకుడు సాధినేని శ్రీనివాసరావు అన్నారు. తిరుపతికి వెళ్తే భక్తులతో పాటు పాటు పారిశ్రామికవేత్తలకు ఈ రైలు ఉపయోగకరమన్నారు.

తిరుమలగిరి(సాగర్): ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నారాయణరెడ్డిని కాంగ్రెస్ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమావత్ కృష్ణనాయక్, జటావత్ లాలునాయక్, మునినాయక్, అంజి, శౌరినాయక్ ఉన్నారు.